క్లుప్తంగా

అంకితభావంతో పనిచేయండి



మాట్లాడుతున్న నూతన కార్యదర్శి శ్రీనివాస్

ఒంగోలు రూరల్: కరవది సచివాలయం–1,2 సిబ్బంది, 32 మంది వలంటీర్లు అంకితభావంతో పనిచేయాలని నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. శనివారం మాట్లాడుతూ మూమెంట్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. అన్ని శాఖల సిబ్బందికి జీతాల చెల్లింపు ఒక్క పంచాయతీరాజ్ శాఖ నుంచే డీడీవో చెల్లిస్తున్నారని కాబట్టి అన్ని శాఖల వారు సహకరించి ఆయా శాఖల సమావేశాలు ఉన్నప్పుడు నెలలో ఒకసారి నిర్వహించాల్సిందిగా తెలియజేశారు. ఏదో ఒక శాఖకు వారంలో సమావేశం ఉండటం వలన 6 పని దినాలు గైర్హాజరవుతున్నారని తెలిపారు. మండల శాఖల అధికారులు ఇట్టి విషయాన్ని పరిగణంలోకి సంబంధిత కార్యదర్శికి సమాచారం ఇవ్వాలని లేదంటే గైర్హాజరుగా నమోదు చేస్తారని చెప్పారు. వలంటీర్లు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

పేస్‌లో ఆరోగ్య సమస్యలపై అవగాహన



డాక్టర్ రవీంద్రబాబును సత్కరిస్తున్న పేస్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఆరోగ్య సమస్యలపై అవగాహన సదస్సు జరిగింది. లక్ష్మీ సూపర్‌స్పెషాల్టీ హాస్పిటల్ అధినేత డాక్టర్ అబ్బూరి రవీంద్రబాబు మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు ద్విచక్రవాహనాలను వాడుతున్నారన్నారు. ప్రమాదంలో తల, వెన్నెముకకు దెబ్బలు తగిలితే తలెత్తే సమస్యల గురించి వివరించారు. హెల్మెట్ ధరించడం ముఖ్యమని తెలిపారు. డాక్టర్ అనుశ్రీ మాట్లాడుతూ గుండె పోటు వచ్చినప్పుడు లేదా ఉన్నఫళంగా కింద పడిన వారిని ఎలా రక్షించాలనే దానిపై సీపీఆర్ ద్వారా ప్రాక్టీస్ చేయించారు. డాక్టర్ సబ మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం ఎలా అనే దానిపై పలు సూచనలు చేశారు. అనంతరం డాక్టర్ రవీంద్రబాబును కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి సత్కరించారు.

మండల స్థాయికి క్రీడా జట్లు



కె.పల్లెపాలెంలో టీషర్టులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఆనందరావు

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): మండలంలో వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో కె.పల్లెపాలెం నుంచి కబడ్డీ, క్రికెట్, ఖోఖో టీంలు మండల స్థాయికి ఎన్నికయ్యాయి. ఈ సందర్భంగా సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు క్రీడాకారులకు ప్రభుత్వం ఇచ్చిన ఆడుదాం ఆంధ్ర టీషర్టులను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు నిర్వహించి నియోజక వర్గ, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా కృషి చేస్తుందన్నారు. మండల స్థాయిలో గెలిపొంది జిల్లా, రాష్ట్ర స్థాయిలో కూడా కె.పల్లెపాలెం టీంలు విజయం సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి మణిదీప్, నాంచార్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ఒంగోలు అర్బన్: అర్హులైన జర్నలిస్టుందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ డెమోక్రటిక్ జర్నలిస్టు ఫోరం నాయకులు శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. దీనిలో ఫోరం నాయకులు మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఫోరం కృషి చేస్తుందన్నారు. దీనిలో అశోక్, రవికుమార్, శ్రీనివాసరావు, శివాజీ, శరత్‌బాబు, సురేంద్ర, అంజయ్య, సుబ్బారావు, థామస్ తదితరులు పాల్గొన్నారు.

వివిధ ఫలాలతో గోదాదేవి అలంకరణ

ఒంగోలు మెట్రో: కరవదలో వేంచేసియున్న వేణుగోపాల స్వామి ఆలయంలో శ్రీ గోదాదేవి కి ధనుర్మాసం సందర్భంగా శనివారం వివిధ రకాల ఫలాలతో చేసిన అమ్మవారి అలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉదయం పంచామృత అభిషేకం నిర్వహించి అనంతరం వివిధ రకాల ఫలాలు, డ్రై ఫ్రూట్స్ తో గోదాదేవికి చేసిన అలంకారం భక్తులను తన్మయత్వంలో ముంచెత్తింది. అర్చన, హారతి మంత్రపుష్పం తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. దేవస్థాన ఈవో వి. శ్రీనివాస్, దేవాలయ ప్రధాన అర్చకులు నారాయణ రఘు ప్రదీప్, సాయి వివేక్, మహిళా భక్త బృందం పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న సీఎం జగన్



పోతవరంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి, పెన్షన్ లబ్ధిదారులు

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెప్పిన మాట ప్రకారమే పింఛను రూ.3 వేలకు పెంచారని మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి అన్నారు. చీమకుర్తి పట్టణంలోని 7వ సచివాలయం పరిధిలో శనివారం స్థానిక కౌన్సిలర్లు మేకల సులోచన యల్లయ్య, ఆముదాలపల్లి ప్రమీల రామబ్రహ్మంతో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో పెంచిన పింఛన్ల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. జేసీఎస్ కన్వీనర్ మంచా హరికృష్ణ, కె.సుబ్రహ్మణ్యం, గుమ్మడిదల శ్రీనివాసరావు, షేక్ రహీం, అడ్మిన్ ఎజ్రా, వెల్ఫేర్ సెక్రటరీ రావులపల్లి తిరుపతయ్య వలంటీర్‌లు పాల్గొన్నారు.

కొత్తకుమ్మరిపాలెంలో...

చీమకుర్తి పట్టణంలోని కొత్తకుమ్మరిపాలెంలో ఇజ్జగిరి అరుణ, రాజవరపు అరుణకు శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, స్థానిక కౌన్సిలర్‌లు మేకల సులోచన, ఆముదాలపల్లి ప్రమీల చేతుల మీదుగా బీమా అందించారు. అరుణ, రాజవరపు భర్తలు అనివార్య కారణాల వలన మృతి చెందటంతో వారికి వైఎస్సార్ బీమా అందించారు.



నూతన పింఛన్ల వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్‌లు



వైఎస్సార్ బీమాను అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్‌లు

నాగులుప్పలపాడు: ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మాట నిలబెట్టుకున్నాడని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. పోతవరం సచివాలయ పరిధిలోని లబ్ధిదారులు తో కలిసి ఎంపీపీ దంపతులు అంజమ్మ కృష్ణారెడ్డి ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఇంత మంచి పాలన అందిస్తున్న జగనన్నకు భవిష్యత్ లో మనందరం అండగా ఉండాలని కోరారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



అల్లూరు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

అల్లూరు (కొత్తపట్నం): మండలంలో అల్లూరు హైస్కూల్‌లో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, కో ఆప్షన్ మెంబర్ షేక్ బాజీ సమేతంగా శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. భోజనం, కూరలు చాలా క్వాలిటీగా తయారు చేస్తున్నారని అభినందనించారు. అనంతరం నాడు–నేడు ద్వారా అదనపు గదులను పరిశీలించారు. క్లాస్ రూములకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడాడు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ఎన్నో మార్పులు తీసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకుని జీవితంలో స్థిర పడే విధంగా చదువుకోవాలని ఆదేశించారు. మీరు చదువుకుంటే అదే మీకు ఆస్తి అన్నారు. శాంతారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నారని ఉపాధ్యాయులను అభినందించారు. మండలంలో అల్లూరు హైస్కూల్‌కు పదో తరగతిలో మొదటి ర్యాంక్ సాధించడం అభినందనీయమన్నారు. బాగా చదువుకుని మీరు ఉన్నత స్థాయికి ఎదిగి స్కూల్‌కు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈవోఆర్డీ ఎ.బాలచెన్నయ్య, హెచ్‌ఎం కె.సీహెచ్ వెంకటసుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేడుకగా ఆడుదాం ఆంధ్ర



గుండ్లాపల్లి పాఠశాలలో క్రికెట్ ఆడుతున్న వెల్లంపల్లి యువకులు

మద్దిపాడు: మండలంలోని ఇనమనమెళ్లూరు, గుండ్లాపల్లి, తెల్లబాడు పాఠశాలలలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో శనివారం గుండ్లాపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వెల్లంపల్లి క్రికెట్ జట్లకు పోటీలు నిర్వహించారు. రెండు జట్లు హోరాహోరీగా పోటీ పడ్డాయి. గెలిపొందిన క్రీడాకారులు 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్న మండల స్థాయి పోటీలకు సిద్ధమౌతున్నారు. క్రికెట్ పోటీలను గ్రామస్తులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. మండల స్థాయిలో జరిగే పోటీలు మరింత వేడుక వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పిచ్చయ్య మాస్టర్ మృతి



బయ్యారపు పిచ్చయ్య మాస్టారు

ఒంగోలు మెట్రో: స్థానిక లాయరు పేట సాయిబాబా మందిర ఫౌండర్ మెంబెర్ బయ్యారపు పిచ్చయ్య మాస్టర్ శనివారం సాయంత్రం శ్రీ భగవాన్ గులాబ్ బాబాలో ఐక్యం పొందారు. ఒంగోలులోని మునిసిపల్ హై స్కూల్ లో ఇంగ్లీష్ అధ్యాపకుడిగా పనిచేసి అనేకమంది విద్యార్థుల అభ్యున్నతికీ విశేషమైన కృషి చేశారు. లాయర్ పేట సాయిబాబా మందిర ప్రారంభంలో ప్రతిరోజూ ఉదయం నైవేద్యం పెట్టి స్కూల్కి వెళ్లేవారు. పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజ వల్ల శ్రీ గులాబ్ బాబా గురించి తెలుసుకొని వారిని దర్శించారు. గులాబ్ బాబా అనుగ్రహంతో వారి జీవిత చరిత్ర పుస్తకం తెలుగులో అనువదించి యావత్ ఆంధ్రప్రదేశ్ అంతా ప్రచారం చేశారు. శ్రీ గులాబ్ బాబా వారి సువర్ణ హస్తాలతో లాయర్ పేట సాయిబాబా విగ్రహ ఆవిష్కరణ జరగడం పిచ్చయ్య మాస్టర్ సంకల్పం వల్లనే సాధ్యమైనది. ఒంగోలు రెండో షిరిడీగా సాయి బాబా మందిరం ప్రసిద్ధి పొందింది. పిచ్చయ్య మాస్టర్ అకాల మృతికి చింతిస్తూ వారి పవిత్ర ఆత్మ సద్గతి పొందాలని వారి కుటుంబ సభ్యులకు షిరిడీ సాయి కల్చరల్ మిషన్ కమిటీ సభ్యులు వారి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాస్టారు వారి పార్థివ శరీరం భక్తుల సందర్శనార్థం ఒంగోలు తూర్పు కమ్మపాలెం, మూడో లైన్ లోని స్వగృహంలో ఉంచారు.

నూతన కార్యవర్గం ఎంపిక ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులుగా నియామక పత్రం అందుకుంటున్న క్లబ్ సభ్యులు

ఒంగోలు మెట్రో: వాసవి క్లబ్స్ అంతర్జాతీయ సేవా సంస్థ జిల్లా 205 లోని వాసవిక్లబ్ ఒంగోలు సిటి జన్ను వైబ్రంట్ ఇయర్ 2024 కి కార్యవర్గ సభ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఏల్చూరి నగేష్ గుప్త, కార్యదర్శిగా భూమా శ్రీనివాసులు కోశాధికారిగా బియ్యపు సంపత్ లు తమ అనుమతి పత్రాలను వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధికారులకు అందించారు. రీజన్ చైర్మన్ టి. రంగస్వామి, జోన్ చైర్మన్ చీదెళ్ల వేంకట ప్రసాదు, రీజియన్ కార్యదర్శి అమరా సత్యనారాయణ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అపెక్స్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



అపెక్స్‌లో సంబరాలు ప్రారంభిస్తున్న ఒంగోలు సింగరాజు మీనా వెంకట్రావు

ఒంగోలు: స్థానిక సుజాతానగర్‌లోని అపెక్స్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సింగరాజు మీనా వెంకట్రావు శనివారం ప్రారంభించారు. భోగిమంటలు, ముగ్గుల పోటీలు, సంప్రదాయ వంటకాల ప్రదర్శన, బొమ్మల కొలువు, చిన్నారులకు భోగిపళ్లు ఇలా సంక్రాంతి సంబరాలను కళ్లకు కట్టినట్లుగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలైన వారికి బహుమతులను అందించారు. మొదటి బహుమతిని పి.నాగమణి, రెండో బహుమతిని బి.జ్యోతి, మూడో బహుమతిని వై.సుప్రజ, కన్సోలేషన్ బహుమతులను సీహెచ్ శ్రావణి, సీహెచ్ పార్వతి, శ్రీకావ్యలు ముఖ్య అతిథి సింగరాజు మీనా వెంకట్రావులకు విశిష్ట అతిథి ఎంఈవో 2 సరస్వతి చేతులమీదుగా అందుకున్నారు. అపెక్స్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.శివకోటి రెడ్డి, ప్రిన్సిపాల్ కె.జ్యోతి తదితరులు పాల్గొని చిన్నారులకు పండుగ ప్రాముఖ్యతను గురించి వివరించారు.

మోడల్ పరీక్షలు సద్వినియోగం చేసుకోండి



టెస్ట్ మోడల్ పరీక్ష పత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, యూటీఎఫ్ సభ్యులు

చీమకుర్తి: టీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన పదోతరగతి మోడల్ పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎఫ్ఐ సంఘం నాయకులు దేవరాజు విజ్ఞప్తి చేశారు. శనివారం చీమకుర్తిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదోతరగతి పరీక్ష పత్రాలను యూటీఎఫ్ సంఘం సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈనెల 7వ తేదీన చీమకుర్తిలోని గౌతమి డిగ్రీ కాలేజీలో నిర్వహించే పరీక్షకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

సామూహికంగా తిరుప్పావై పాశురాలు



తిరుప్పావై ప్రవచనాలలో మహిళా భక్తులు ఆలయ నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి గద్దలగుంటపాలెం ఓం శ్రీహరి తిరుప్పావై పారాయణ భక్త మహిళా బృందం భక్తిశ్రద్ధలతో ఆలపించిన సామూహిక 21 తిరుప్పావై పాశుర పారాయణం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వహణాధికారి డి.రజనీ కుమారి, సభ్యులు కుర్రా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ శ్రీరంగనాథుని పరిణయమాడి, ఆయనలో ఐక్యమయ్యేందుకు ధనుర్మాసంలో 30 రోజుల పాటు ప్రతిరోజు వేకువజామున స్వామిని మేల్కొల్పుతూ తన లక్ష్యాన్ని సాధించిన గోదాదేవి పాడిన దివ్య ప్రబంధ తిరుప్పావై పాశురాలు భగవంతుడి అనుగ్రహం పొందేందుకు నేటికీ భక్తజన కోటి అభీష్టంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా 30 రోజుల పాటు తిరుమలలో స్వామి మేల్కొలుపు సుప్రభాతం స్థానంలో తిరుప్పావై పాశురాలను చదవడం సాంప్రదాయంగా వస్తుందన్నారు. సామూహిక పారాయణలో పాల్గొన్న ఓం శ్రీ హరి పారాయణా మహిళా బృంద సభ్యులను సత్కరించారు. అనంతరం అర్చక స్వాములు పరాంకుశం రమానాథ చార్యులు, వేద పండితులు కూరపాటి ఆంజనేయ శర్మావధాని సారథ్యంలో గోదాదేవి అమ్మ కి ప్రత్యేక పూజలు చేశారు. ఈదుపల్లి గురునాథ రావు, చైర్మన్ డి.రజనికుమారి పాల్గొన్నారు.

జన్ మన్ పథకంపై అవగాహన

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువమెట్ట తండా గ్రామ పంచాయతీలోని చెంచుకాలనీలో స్థానిక ఎంపీడీఓ హేమలత ఆధ్వర్యంలో శనివారం జన్ మన్ పథకంపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి జన్ మన్ పథకంలో భాగంగా ఇళ్లు, వైద్యం, విద్య, ఇంటింటికి మంచినీటి కుళాయి సదుపాయం కల్పించామని చెప్పారు.

అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు

పొదిలి: లాడ్జిల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వెంకట సైదులు హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో లాడ్జిల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. గదుల కోసం, మంచాల కోసం వచ్చే వారి వివరాలు పక్కాగా రికార్డుల్లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. వ్యక్తుల ఆధార్ కార్డు ప్రూఫ్‌గా తీసుకోవాలని సూచించారు. లాడ్జిల్లో గ్యాంబ్లింగ్, పేకాట, వ్యభిచారం, లిక్కర్ తాగించడం తదితర కార్యకలాపాలకు అనుమతిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

పొన్నూరుకి పూర్ణకుంభ పురస్కారం



పూర్ణకుంభ పురస్కారాన్ని అందుకుంటున్న పొన్నూరు శ్రీనివాసులు

ఒంగోలు మెట్రో: ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు రాజమండ్రిలో ఈ నెల 5,6,7 తేదీల్లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ తెలుగు భాష ఉత్సవాల్లో ప్రకాశం జిల్లా రచయితల సంఘం గత 60 సంవత్సరాలుగా జిల్లాలో తెలుగుభాషా అభివృద్ధికి విశేషంగా కృషిచేస్తున్నందుకు సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులుకు పూర్ణకుంభ పురస్కారాన్ని ప్రదానం చేశారు. హైకోర్టు జస్టిస్ డి.కృష్ణమోహన్, ఆంధ్రరాష్ట్ర అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ మాస్ట్రో గజల్ శ్రీనివాస్, చైతన్య విద్యా సంస్థల చైర్మన్ చైతన్యరాజు తదితరులు పురస్కారాన్ని ప్రదానం చేశారు. అంతర్జాతీయ మహాసభల్లో ఆదికవి నన్నయ్య వేదికపై ప్రముఖ తెలుగు వాగ్గేయకారుడు రామదాసుపై పొన్నూరు వేంకట శ్రీనివాసులు ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రకాశం రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి, సంఘ సభ్యులు మూడమంచు వెంకటేశ్వర్లు, అడ్వకేట్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బూచేపల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందుకుంటున్న విద్యార్థులు



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న యూటీఎఫ్ సభ్యులు

దర్శి: బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 10వ తరగతి విద్యార్థులకు పుస్తకాలు, మెటీరియల్స్, ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ట్యాబ్‌లు సర్పంచ్ నాగేశ్వరరావు, ఎంపీటీసీ రాచపూడి రత్నంలు చేతుల మీదుగా ట్యాబ్‌లు, పుస్తకాలు పంపిణీ చేశారు. తూర్పు చౌటపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని నాడు–నేడు, అమ్మఒడి వంటి మంచి పథకాలు ప్రవేశ పెట్టారని చెప్పారు. పీసీ చైర్మన్ రాచపూడి ప్రభాకర్, ప్రధానోపాధ్యాయులు పి.సుధాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు మారం నాగిరెడ్డి. భాస్కర్ పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు శనివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు షేక్ అబ్దుల్‌హై మాట్లాడుతూ.. పలువురు యూటీఎఫ్ సభ్యుల సహకారంతో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బుక్స్ అందజేస్తున్నామన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ప్రభుత్వ పాఠశాలలకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, యూటీఎఫ్ మండల కమిటీ సభ్యులు నాసర్‌మహమ్మద్, కామేశ్వరరావు, సీహెచ్ సుబ్రహ్మణ్యం, ఎస్‌కే కాశీం, సీహెచ్ శర్మ, వేమూరి శ్రీనివాసులు, మహమ్మద్‌ఆలీ, ఆదాం, మస్తాన్, మునగ రామారావు, కైపు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కేజీబీవీలో సంక్రాంతి సంబరాలు



తర్లుపాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో హరిదాసుల వేషంలో విద్యార్థులు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కేజీబీవీలో శనివారం ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ పర్యవేక్షణలో ముందస్తు సంక్రాంతి సంబరాలు వేడుకగా నిర్వహించారు. ఉపాధ్యాయులు,బాలికలు రంగవల్లులు తీర్చిదిద్ది గొబ్బెమ్మలతో అలంకరించి బోగి మంట వేశారు. బాలికలుప్రదర్శించిన హరిదాసు, ఎరుకలసాని, పల్లె పడుచుల వేషధారణలు ఆహూతులనుఆకట్టుకున్నాయి. ఎల్లెల్లో సంక్రాంతిని ప్రతిబింబించేలాబాలికలు ప్రదర్శించిన నాటిక అలరించింది.

తర్లుపాడులో..

తర్లుపాడు: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ రంగోలిలో విద్యార్థులు బృందాలుగా ఏర్పడి సైన్స్ చిత్రపటాలకు రంగులద్దారు. న్యాయనిర్ణేతలుగా లూథరన్ హైస్కూల్ హెచ్‌ఎం కెజియారాణి, ఉపాధ్యాయులు నారాయణం తులసీ, రేవతిలు వ్యవహరించారు. విద్యార్థులకు ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, సర్పంచ్ వరాలు, హెచ్‌ఎం సుధాకర్ బహుమతులు అందజేశారు. విద్యార్థులు హరిదాసుల వేషంలో అలరించారు.

జార్జి కాలేజీ ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న డాక్టర్ రాజబాబు

మార్కాపురం: డాక్టర్ సామ్యేలు జార్జి ఇంజినీరింగ్ కళాశాల కెమిస్ట్రీ విభాగం హెచ్‌ఓడీ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చిలకపాటి రాజబాబుకు ఫిలాసఫీ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్‌లో రీసెర్చ్ చేసినందుకు శనివారం అనంతపురం జేఎన్‌టీయూ స్నాతకోత్సవంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ రంగ జనార్దన్ చేతులమీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ ఆదిమూలపు విశాల్, అడ్వైజర్ డాక్టర్ సతీష్, హెచ్ఓడీ మస్తానయ్య తదితరులు అభినందించారు.

జూదరుల అరెస్ట్

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరప్పాడు సమీప పొలాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు మద్దిపాడు ఎస్ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో కలిసి దాడి చేయగా అక్కడ ముగ్గురు వ్యక్తులు ఒక కోడి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 5300 రూపాయల నగదు లభ్యమైనట్లు తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి సోమవారం కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు.

కన్వీనర్‌గా విజయ్ మోడీ నియామకం

ఒంగోలు సెంట్రల్: భారతీయ జనతా పార్టీ నార్త్ ఇండియన్ సెల్ కన్వీనర్‌గా విజయ్‌మోడీ నియమితులైనట్లు జిల్లా పార్టీ అధ్యక్షుడు పీవీ శివా రెడ్డి తెలిపారు. ఆయనను శనివారం కలిసి పార్టీ అభ్యున్నతికి తన వంతు కృషిచేస్తానని చెప్పారు. గుర్రం సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి బసినేపల్లి రాజశేఖర్ పాల్గొన్నారు.

రౌడీషీటర్ల బైండోవర్

మద్దిపాడు: మండల పరిధిలో ఉన్న 18 మంది రౌడీషీటర్లు, 44 మంది సస్పెక్ట్‌లను తహసీల్దార్ వద్ద బైండోవర్ చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎస్పీ మలికా గర్గ్ ఆదేశాల మేరకు స్టేషన్ పరిధిలో ఉన్న వారిని బైయిండోవర్ చేయిస్తున్నామని, వారితో పాటు గతంలో ఎన్నికల సమయంలో అలజడులు సృష్టించడానికి ప్రయత్నించిన వ్యక్తులను కూడా జాబితాలో ఉన్నారని తెలిపారు. ఎవరైనా ఎన్నికల నియమావళి వచ్చిన తరువాత అలజడులకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.